క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

సీటీఆర్‌ఐ: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ యడ్లపల్లి దీపక్ అన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్లో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలి దశలో క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలి, లక్షణాలు, చికిత్స పద్ధతులు, నివారణ మార్గాలను వివరించారు. ఇందులో భాగంగా సుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ మూర్తి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లక్ష్మీ దీపికకు నాట్యకౌశల అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న లక్ష్మీ దీపిక

సీటీఆర్‌ఐ: నగరానికి చెందిన శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర విద్యార్థిని గోరుగంతు లక్ష్మీదీపికకు నాట్యకౌశల అవార్డు ప్రదానం చేశారని కళాక్షేత్ర నిర్వాహకుడు ఆచార్య బదిరి నారాయణ తెలిపారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ అవార్డు అందజేశారన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ



పల్లి జాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామానికి చెందిన ఎస్సీ యువకుడు పల్లిజాన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు, పార్టీ శ్రేణులు పరామర్శించారు. ఘటనను జిల్లా ఎస్పీ, హ్యూమన్ రైట్స్, నేషనల్ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. పరామర్శించిన వారిలో దున్నా సుమన్ బాబు, రాయుడు సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ముగిసిన ఆర్‌ఎంసీ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

ప్రకాశం నగర్: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆర్‌ఎంసీ – 2023 క్రీడా పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మధ్య స్నేహభావం పెంపొందించడంలో భాగంగా ఈ క్రీడలు నిర్వహించామన్నారు. కబడ్డీ, కోకో, క్రికెట్, క్యారమ్స్, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, టెన్ని క్యాయిట్, టేబుల్ టెన్నిస్, పరుగు పందెం, హై జంప్, రిలే, నడక, షార్ట్‌పుట్ తదితర అంశాలలో 500 మందికి పైగా మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. విజేతలకు కమిషనర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగరావు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు

కడియం: స్థానిక పడాల వారి వీధిలోని సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద వచ్చేనెల 3వ తేదీ నుంచి లక్ష్మీ సుదర్శన హోమ సహిత పంచమ వార్షిక పూజా మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. వేదాంతం జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది నుంచి ఆయా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదే రోజు అన్నసమారాధన నిర్వహిస్తారు.

యోగా శిక్షణ ప్రారంభం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో సేవా ఉగాది సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న యోగా శిక్షణను స్థానిక వైద్యుడు రాంబాబు ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామంలోని గోదావరి విద్యా పీఠం ప్రాంగణంలో 30 రోజులు జరిగే ఈ శిక్షణకు వంకా సూర్యనారాయణ అండ్ సన్స్ సహకారం అందిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆటంబాంబ్

- మొబైల్ గేమ్స్‌పై పిల్లల ఆసక్తి
- హద్దు మీరితే అనర్థాలే
- తల్లిదండ్రులు గమనించాలంటున్న నిపుణులు

ప్రకాశం నగర్: ఆటలు అంటే చిన్నారులకు ఎంతో సరదా. అటువంటి ఆటలు తోటి స్నేహితులతో మైదానంలో ఆడితే శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం చేకూరుతుంది. పెరిగిన టెక్నాలజీ కారణంగా ప్రతి ఒక్కరి చేతిలోకి ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, వివిధ రకాల పన్నుల చెల్లింపులు వంటి అన్ని రకాల సేవలను ఫోన్‌లో నిర్వహిస్తున్నాం. ప్లేస్టోర్ నుంచి ఆయా రకాల యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకుని సేవలను వినియోగించుకుంటున్నాం. ఈ క్రమంలోనే కొన్ని రకాల ఆన్‌లైన్ గేమ్స్ యాప్‌లు నెట్టింట్లో సందడి చేస్తున్నాయి. ఈ యాప్‌ల్లో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు సంబంధించిన యాప్‌లతో పాటు పేకాట, గుండాట, హార్స్ రేజింగ్ వంటి జూద క్రీడాలు దర్శనమిస్తున్నాయి. పబ్‌జీ తరహాలో వచ్చిన స్నైపర్ అటాక్, ఫ్రీ ఫైర్, కవర్ ఫైర్, మోడ్రన్ స్ట్రైక్, గ్రాండ్ బ్యాటిల్ రాయల్ వంటి ఆటల్లో చిన్నారులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆటల్లో మునిగి తేలుతున్నారు.



వివిధ రకాల మొబైల్‌గేమ్స్ యాప్‌లు

మోసాల ఊబి!

ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి సొమ్ములు గెలుచుకున్న వారు తక్కువ శాతంలో ఉన్నప్పటికీ, పోగొట్టుకున్న వారు ఎక్కువగా ఉంటున్నారని టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో ఈజీగా డబ్బు సంపాదించవచ్చనే ప్రకటనలు హల్‌చల్ చేస్తున్నాయి. యాప్ ఇన్‌స్టాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటే బోనస్ పాయింట్లు, ప్రైజ్‌మనీ అందిస్తున్నారు. దీంతో యువత ఆయా బోనస్ పాయింట్లతో ఆడడం మొదలు పెట్టి, చివరికి బ్యాంక్, యూపీఐల ద్వారా సొంత డబ్బును చెల్లించి మోసాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా యువత ఇటువంటి బెట్టింగ్ ఆటలకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. వీరితో పాటు చిన్నారులు ఆడుకునే కొన్నిరకాల స్నేపర్ గేమ్స్‌లోనూ సొమ్ములు స్వాహా అయిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో చిన్నారులు వాడే ఆన్‌లైన్ అప్లికేషన్లపై పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా చిన్నారులను సాధ్యమైనంత వరకు మొబైల్ గేమ్స్ ఆడకుండా నియంత్రించాలి. అధిక సమయం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న చిన్నారులు చదవడం, తినడం మానేసి నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. చదువులో వెనుకపాటు, దృష్టి సారించలేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటితో పాటు విపరీతమైన ఒత్తిడి కారణంగా మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

సమస్యలు తలెత్తే అవకాశం



సెల్‌ఫోన్ ఎక్కువగా చూసేవారికి ఒత్తిడి, కోపం, డిప్రెషన్ వంటి మానసిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. సెల్‌ఫోన్లలోని కొన్ని గేమ్స్ కారణంగా పిల్లల్లో హింసాత్మక ధోరణి పెరుగుతుంది. చెడును పిల్లలు తొందరగా ఆకళింపు చేసుకుంటారు. యాప్‌ల కారణంగా మెదడుకు పనిచెప్పే అవసరం లేకుండా పోయింది. దీంతో మెదడులో ఆలోచించే శక్తి తగ్గిపోతుంది.

– కర్రి రామారెడ్డి,
ప్రముఖ మానసిక వైద్య నిపుణులు

18న ఒనువులమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో సుమారు రూ.2 కోట్లతో అత్యంత సుందరంగా నిర్మిస్తున్న ఒనువులమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం మార్చి 18న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. 18వ తేదీ 10.18 గంటలకు ప్రతిష్ఠ మహోత్సవం, యంత్ర స్థాపన, పూర్ణాహుతి అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు. 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రుత్విక్కులతో హోమాలు, ప్రత్యేక పూజలు, 17వ తేదీన అమ్మవారి గ్రామ ప్రదక్షిణం, కళాహోమం జరుగుతుంది. సమావేశంలో ఉప్పులూరి సత్యనారాయణ, శివరామకృష్ణ, కిషోర్, ఉప్పులూరి రాము, మాసిన సుబ్బారావు, సుంకవల్లి వెంకట రత్నం, వెంకట్రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం

కడియం: దుళ్ల కాలనీలోని వినాయకుని ఆలయ 27వ ప్రతిష్ఠాపనా దినోత్సవాన్ని పురస్కరించుని ఆదివారం ఏకాహం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం భజన పాళీలు ఆధ్యాత్మిక గీతాలాపనలు ప్రారంభించాయి. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే సోమవారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కంబాలచెరువు: స్థానిక వీటీ డిగ్రీ కళాశాలలో 1983 – 86లో బీకాం చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక లా హాస్పిన్ హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 37 ఏళ్ల క్రితం డిగ్రీ చదువుకున్న వీరందరూ తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని సందడి చేశారు. అప్పట్లో పనిచేసిన అధ్యాపకులు ఎం.సూర్యనారాయణ, కె.ప్రభాకరరావు, జి.రమణయ్యను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న 30 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. కటికి కుమార స్వామి, సూరిబాబు, శివకుమార్, సమత, రాధిక, జిలానీ పాల్గొన్నారు.

1998 బ్యాచ్ విద్యార్థుల సందడి

లూథరన్ హైస్కూల్ 1998 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. అనంతరం గురువులను శాలువా, పూలదండలతో సత్కరించారు. స్కూల్‌కు బీరువాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్‌కే రాజా, రాజశేఖర్, చంద్రశేఖర్, సుదీర్, చాపల చిన్నరాజు, అశోక్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోదావరి బాలోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ప్రకాశం నగర్: గోదావరి బాలోత్సవం పిల్లల పండగ ఆదివారం సాయంత్రం కోలాహలంగా ముగిసింది. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ముగింపు సభలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలల స్వేచ్ఛను హరించవద్దని సూచించారు. వారికి నచ్చిన విధంగా నడుచుకునేలా ప్రోత్సహించాలన్నారు. బాలల్లో అత్యుత్తమ ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీయడం ద్వారా వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఎదుగుతారని గ్రహించాలన్నారు. ప్రముఖ న్యాయవాదులు మద్దూరి శివసుబ్బారావు, ముప్పాళ్ల సుబ్బారావు, డీఈవో బి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని, అందుకు బాలోత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం రెండు రోజులపాటు కల్చరల్, అకడమిక్ విభాగాల్లో నిర్వహించిన 60 పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలలకు నున్న తిరుమలరావు, డాక్టర్ గన్ని భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కృష్ణకుమార్, పి.తులసి పాల్గొన్నారు.

ఘనంగా 'బాలరాజు' వజ్రోత్సవ వేడుక

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' వ్యవస్థాపకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన జానపదచిత్రం బాలరాజు వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై జిత్‌మోహన్‌మిత్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత పోలీసు అధికారి, కళాభిమాని వలిరెడ్డి జగపతిని అక్కినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, సుంకర భాస్కర రంగారావు, మిర్తిపాటి శేషగిరిరావు, బి.సీతా రామారావు, ఎన్.సూరిబాబు కట్టా చంద్రరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కందుల దుర్గేష్, జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

క్రైం కార్నర్..

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: స్థానిక జగదీశ్వరి హోటల్లో వ్యక్తి అనుమానాస్పద మృతిలో ఆదివారం మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారణాసికి చెందిన ఉదయ్ సరోజ్ శంకర్ (66) కడియం వచ్చి పూలమొక్కలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో ఈనెల 22న రాజమహేంద్రవరం వచ్చి జగదీశ్వరి హోటల్‌లో దిగాడు. శనివారం రాత్రి బయటకు వెళ్లి బిర్యానీ తిని వచ్చి పడుకున్నాడు. అయితే గుండెల్లో మంట వస్తోందని హోటల్ సిబ్బందికి తెలిపాడు. ఏవైనా మందులు తీసుకురావాలా అని వారు అడగ్గా వద్దని చెప్పాడు. మర్నాడు ఉదయం హోటల్ సిబ్బంది బెల్ కొట్టినా ఎంతసేపటికి తలుపుతీయలేదు. దీంతో వారు వేరే తాళంతో గది తలుపులు తీసి చూడగా సరోజ్ శంకర్ విగతజీవిగా పడి ఉన్నాడు. సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

తండ్రిపై కుమారుడి దాడి

కంబాలచెరువు: తండ్రిపై కుమారుడు దాడి చేసిన సంఘటన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గోరక్షణపేటకు చెందిన ఏడిద సునీల్ గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ విషయంలో తండ్రి అప్పారావుతో అతడికి వివాదం జరుగుతోంది. దీంతో ఈ విషయాన్ని అప్పారావు తన బావమరిది రాజుకు చెప్పాడు. ఆయన సునీల్‌ని పిలిచి మాట్లాడుతుండగా తండ్రీకుమారులకు వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న గాజు సీసాను బద్దలు కొట్టి దానితో తండ్రి మెడపై సునీల్ దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన అప్పారావును ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

కొవ్వూరు: కాకినాడ జిల్లా కోరంగి గ్రామానికి చెందిన పోతురాజు ఆనందకుమార్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ కొవ్వూరులో చోరీకి గురైంది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు కొవ్వూరులోని లక్ష్మీ కేఫ్ వద్ద ఆయన తన వాహనాన్ని పార్కింగ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ మోటార్ సైకిల్‌ను అపహరించుకు పోయారు. దీనిపై బాధితుడు ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

జగన్ మన నమ్మకం.. నిజం మన ఆయుధం

- శాశ్వత అభివృద్ధే లక్ష్యంగా పాలన
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో చందన నాగేశ్వర్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: జగన్ మన నమ్మకం.. నిజం మన ఆయుధం అని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామంలోని జక్కంపూడి రామ్మోహనరావు కల్యాణ మండపంలో ఆదివారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలకు ఒకవైపు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. మరోవైపు వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా ఆంగ్ల మాధ్యమంతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నారన్నారు. పాఠశాలల స్థితిగతులు మార్చడం జరిగిందన్నారు. సీఎం జగన్ నిర్దేశించిన మార్గంలోనే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నడవాలన్నారు. గృహసారథులు తమకు నిర్దేశించిన కుటుంబాలను కలసి వారితో కనీసం 20 నిమిషాలు మాట్లాడి వారితో మమేకం కావాలన్నారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకుని.. ఒకవేళ ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వలంటీర్‌కు తెలియజేయాలన్నారు.

'లాట్స్'తో యువతకు మంచి భవిష్యత్తు



కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ ప్రెసిడెంట్ కార్తికేయన్

రాజమహేంద్రవరం సిటీ: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జోన్-4 ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన లోకల్ ఆర్గనైజేషన్ ట్రైనింగ్ సెషన్స్ (లాట్స్) యువత భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని జేసీఐ నేషనల్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ కార్తికేయన్ అన్నారు. స్థానిక ఆనంద్ రీజెన్సీలో శని, ఆదివారాల్లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కార్తికేయన్ మాట్లాడుతూ జేసీఐ లామ్ ఆఫీసర్స్ మరింత మెరుగ్గా పనిచేయడానికి ఈ ట్రైనింగ్ దోహదపడుతుందన్నారు. అనంతరం జేసీఐ రాజమహేంద్రవరం స్టార్టప్స్ లామ్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా అంకుర సంస్థలను ప్రోత్సహించాలనే ఆలోచన చేసిన లాంమెంటర్ రామ్‌కుమార్ రాందేవ్‌ను అభినందించారు. జేసీఐ రాజమహేంద్రవరం గోదావరి ఫాస్ట్ ప్రెసిడెంట్ రామ్‌కుమార్ రాందేవ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ యువత ఎదగాలని సూచించారు. ఇందుకు సరైన వేదిక కల్పించాలనే ఉద్దేశంతో రాజమహేంద్రవరం స్టార్టప్స్ ప్రారంభించామన్నారు. దీనిద్వారా సభ్యులకు జీవితంలో ఎదగటానికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాలు అందిపుచ్చుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ ప్రెసిడెంట్ వర్మ, రాహుల్, డాక్టర్ మురళీ, డాక్టర్ ప్రియాంక, రాష్ట్రవ్యాప్తంగా 250 మంది లామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సూర్యభగవానుడు ప్రత్యక్ష దైవం



సూర్య కల్యాణంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: లోక కల్యాణానికి ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుని కరుణ చాలా ముఖ్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక సీతంపేట ఏపీ పేపర్‌మిల్లు రోడ్డులో సప్తమ వార్షిక మాఘమాస దీక్షగా 36 రోజులు నిర్వహించిన హోమ శతచండీ సహిత సౌరయాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యభగవానునికి అత్యంత ప్రీతికరమైనది మాఘమాసమన్నారు. వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి ఫిబ్రవరి 26 వరకూ ఇంతటి పవిత్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక లింగాష్టకం

సీటీఆర్‌ఐ: నారాయణా హరి ఓమ్ అనే దివ్య మంత్రంతో ప్రజలందరూ సుఖశాంతాలతో సుభిక్షంగా ఉండాలని డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో 108 మంది భక్తులతో ఆదివారం సామూహిక లింగాష్టకం, గోవింద నామస్మరణ అత్యంత వైభవంగా నిర్వహించారు. మనగుడి–మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి, సర్వేజన సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ గాడాలలోని మహాలక్ష్మి సమేత చిన్నవెంకటేశ్వరస్వామి పీఠంలో గుడ్లగూబ వాహనంపై శ్రీమహాలక్ష్మి కొలువై ఉన్నారన్నారు. సర్వేజన సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటివరకూ 5 లక్షల మంది నిరాశ్రయులకు అన్నవితరణ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ (అమెరికా) నుంచి ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న జాతీయ, ప్రపంచస్థాయి అవార్డు గ్రహీత చిన్న వెంకన్నబాబుకు శిష్యబృందం ఆధ్వర్యంలో జీవన సాఫల్య సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు ఆకుండి వెంకటేశ్వరరావు, పవనగిరి స్వామి, శంకమంచి వెంకటరాఘవస్వామి, ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ వెంకటరమణ, సత్యసాయి, హైమవతి పాల్గొన్నారు.



చిన్న వెంకన్నబాబు దంపతుల సత్కార సభలో మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు

జాతీయస్థాయి పోటీల్లో నాగబాబు ప్రతిభ

ప్రకాశం నగర్: పశ్చిమ బంగాలోని అరబిందో స్టేడియంలో ఈనెల 10 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపిన యాతం నాగబాబును వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభినందించారు. నాగబాబు తాను గెలుచుకున్న మూడు స్వర్ణ పతకాలతో ఆదివారం మర్యాదపూర్వకంగా ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిశారు. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగంలో కాకినాడ సబ్ యూనిట్ అధికారిగా నాగబాబు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ అథ్లెటిక్స్‌లో వివిధ విభాగాలలో 15 స్వర్ణ, 19 రజత, 26 కాంస్య పతకాలను ఆయన సాధించారు.



నాగబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అభినందనలు తెలుపుతున్న ఎంపీ భరత్ రామ్

ఉమా చోడేశ్వరునికి విశేష పూజలు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరు ఉమా చోడేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు శ్రీ సూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామి వారికి బిల్వార్చన చేశారు.స్వామి వారికి రుద్రహోమం, బిల్వార్చన నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకుడు కొతవరపు భాను, బాలప్ప ప్రసాద్, బాలప్ప రుక్మంగధరరావు, వాజపేయిల సూర్యనారాయణ, చావలి దుర్గాప్రసాద్, చట్టి వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.